


# ప్రాణిభయం

ప్రతాప రవిశంకర్

**అడవి** పెద్దదే. ఎన్నో రకాల చెట్లు. కొన్ని పెద్దవి. కొన్ని మరీ పెద్దవి. మరికొన్ని చాలా చిన్న చెట్లు.

ముళ్ళ పొదలు కూడా ఉన్నాయి. పొదల మధ్య నించి దారి ఉన్నదో, లేదో కూడా తెలియదు. ఆ దార్లు తెలియా లంటే ఆ అడవితో బాగా పరిచయం ఉండి తీరాలి. లేకపోతే అడుగు ముందుకు వెయ్యటం కష్టమే మరి.

కాని రాజయ్య ఎటువంటి కష్టమూ లేకుండా ఆ అడవిలో ఎన్ని అడుగు లయినా వెయ్యగలడు. అడవిలో ఉన్న ఆ దారులన్నీ అతనికి బాగా తెలుసు. ఏ దారి ఏటు వెళుతుందో, ఏ దారి ఎక్కడ మలుపు తిరుగుతుందో అన్నీ బాగా గుర్తే.

ఇన్ని అడవి దారులు రాజయ్యకి క్షుణ్ణంగా తెలుసునంటే గొప్పేమీ కాదు. అతను ఎన్నో ఏళ్ళు ఫారెస్టు డిపార్టుమెంటులో నౌకరీ చేసి కొన్నేళ్ళ క్రితమే రిటైరు అయ్యాడు. ఉద్యోగం నుంచి రిటైరు అయినా ఆ అడవి దారుల వెంట తిరగటాన్ని రాజయ్య మానెయ్యలేదు.

ఒక్కరోజయినా అడవిలోకి రాకపోతే, ఆ చెట్లన్నీ పుట్టలనీ, పొదలనీ పలకరించకపోతే అతనికి కాలం గడిచి నట్లు అనిపించదు.

ఆ అడవిలో ఏ వైపుకు వెళితే ఏ ప్రమాదం ముంచుకు వస్తుందో అతడికి బాగా తెలుసు.

"ఇంకెందుకా అడవిలో తిరగటం రోజూ. . .ఇంటిపట్టున కూర్చోరాదూ" అంటాడు రాజయ్య కొడుకు. కోడలు కూడా అదే మాటన, అంటుంది. అయినా రాజయ్య వినడు. అదోరకంగా నవ్వుతాడు.

ఒంట్లో ఇంకొంచెం శక్తి ఉందం టాడు. తను వెళ్ళకపోతే అడవిలో చెట్లు, ఆకులు, పువ్వులు, తీగెలు దిగులు పడిపోతా యంటాడు. ఎంత చెప్పినా వినడు.

అడవిలోకి వెళతాడు.

మధ్యాహ్నం పన్నెండు గంటలకల్లా అడవిలో కొంత దూరానికి వెళ్ళి పోతాడు. ఎక్కడ నీటి దొరువులు ఉన్నాయో రాజయ్యకు తెలుసు కాబట్టి బాగా కరకరా ఆకలి అయ్యేసరికి ఆ నీటి దొరువు దగ్గరకు చేరుకుంటాడు. తను మూట కట్టుకుని తీసుకువచ్చిన తిండిని తింటాడు. నీళ్ళు తాగుతాడు.

ఇక ఆ తర్వాత మళ్ళీ ఏ కుందేలు కోసమో అడవి పిట్టలకోసమో వేట. రాజయ్య అదృష్టం బావుంటే ఏదయినా చిన్న జంతువో, లేకపోతే ఏదయినా పిట్టో దొరుకుతుంది. లేకపోతే ఒక్కో రోజు ఆ నీటి దొరువుల్లోనే చిన్న చిన్న చేపల్ని పట్టుకు వస్తాడు.

ఏ అడవి జంతువు బారి నుంచి ఏ విధంగా ప్రాణాన్ని కాపాడుకోవాలో రాజయ్యకు బాగా తెలుసు. ఏ జంతువు అయినా రాబోయే ముందు అడవిలో పిట్టల గొడవ ఎలా ఉంటుందో అతనికి తెలియనిది కాదు. అందుకే అతను అడవిదారుల్లో నడిచేటప్పుడు చెవులు రిక్కించి నడుస్తూ ఉంటాడు. ఎంత చిన్న శబ్దాన్నయినా ఇట్టే ఆలకిస్తాడు.

రాజయ్య దగ్గర ఆయుధాలంటూ ఉన్నవి రెండే రెండు. ఒకటి పొడుగాటి వెదురు కర్ర. రెండు—కత్తి. రోజూ రాజయ్యకు సాధారణంగా ఎదురయ్యేవి పాములే. అలికిడి వినగానే పొదల్లోకి పరుగులు దీస్తూ ఉంటాయి. ఎప్పుడైనా ఒక పాము దారికి ఎదురు నిలిచి రాజయ్యను అటకాయిస్తుంది. ఇక అటువంటి సమయంలో రాజయ్య తన కర్రకు పని చెబుతాడు. ఒక్క దెబ్బకు ఆ ప్రాణం గింగిరాలు తిరగాల్సిందే. ఎందుకో పాములను చంపటం రాజయ్యకు ఇష్టం ఉండదు. ఎప్పుడో అతని తండ్రి రాజయ్య చిన్నతనంలో చెప్పాడు పాములను చంపవద్దని. అందుకే తప్పని సరి అయితే తప్ప అతను పాముల జోలికి వెళ్ళడు.


వేసవి కాలంలో అయితే పైన ఎండ మండుతూ ఉంటుంది. అయినా అడవిలో నడుస్తుంటే ఎరిడ వేడిమే తెలియదు. దట్టంగా పెరిగిన చెట్లు తీగెలు ఎండను లోపలకు రానివ్వవు.

అప్పుడప్పుడు అడవిలో షికారు చేసే అతనికి తేనెపట్లు కనపడతాయి. తేనె పట్లు కనపడితే రాజయ్య వదిలి పెట్టడు. తేనె పిండుకునే ఇంటికి వస్తాడు. రాజయ్య కొడుక్కి తేనె అంటే ఎంతో ఇష్టం. ఇద్దరు మనవళ్ళు కూడా తేనె తాగడానికి ఎంతో సంతోషం కనపరుస్తారు. వాళ్ళ కోసమే తేనె!

ఎప్పుడయినా ఫారెస్టు ఉద్యోగులు జీపులో వెళుతూ అతనికి ఎదురు పడతారు. వాళ్ళకు రాజయ్య వినయంగా దణ్ణాలు పెడతాడు. 'ఇంకెందుకయ్యా రాజయ్యా నీ కీ అడవిలో షికార్లు మా కెలాగూ తప్పదు' అంటారు. 'అలవాటయిన ప్రాణం - బాబూ' అంటాడు. వాళ్ళు అతని ఆరోగ్యం గురించి ప్రశ్నలు వేస్తారు. అతను తనకు చూపు సరిగా ఆనటం లేదనీ పొద్దువాలిపోతే కళ్ళు సరిగా కనిపించవనీ చెబుతాడు. వాళ్ళు అతన్ని జీపులో ఎక్కించుకుంటారు. వారిలో ఎవరయినా ఒక సిగరెట్టు ఇస్తే అతను కాలుస్తాడు. కృతజ్ఞతలు చెప్పుకుంటాడు.

అడవిలో ప్రవేశించగానే రాజయ్య కళ్ళు అటూ ఇటూ వెతుకుతూ ఉంటాయి. ఆ వెతుకులాట కుందేళ్ళ కోసమే. కుందేళ్ళంటే రాజయ్యకు చెప్పలేనంత ఇష్టం. కుందేలు మాంస మంత రుచిగా ఇంకేదీ ఉండదని అంటాడు అతను. అతని మనవళ్ళయితే మరీ మరీ లొట్టలేసుకుని తింటారు. అందుకే వీలయినంతవరకు రాజయ్య కుందేళ్ళను పట్టుకోటానికి ప్రయత్నం చేస్తాడు. కాని అవి అంత సులభంగా దొరకవు. అలికిడి వినగానే రివ్వున పరుగులు దీస్తాయి. పొదల్లో దూరి అదృశ్య మవుతాయి.

కాని ఆ రోజు రాజయ్య నక్కను తొక్కి వచ్చాడేమో! అతని అదృష్టం బావుంది. కుందేలు దొరికింది. అతని సంతోషం అంతా ఇంతా కాదు. అది తప్పించుకుని పొదల్లోకి పరుగుదీయాలని చూస్తుంటే దాని చెవుల్ని మరింత గట్టిగా పట్టుకుని "ఏమే చెవుల పిల్లీ. . ఈ రాజయ్య చేతికి చిక్కిన తర్వాత తప్పించుకుందామనే? ఈ రాజయ్య ఫారెస్టు నౌకరీ చేసిన మనిషే' అన్నాడు నవ్వుతూ.




ఫారెస్టు మనిషంటే దానికి తెలుసునో ఏమో ఆ కుందేలు రాజయ్య మొహం లోకి మరింత భయంగా చూసింది.

రాజయ్య పెద్ద పెద్ద అడుగులు వేస్తూ గంభీరంగా నడుస్తున్నాడు. ఎండుటాకులు, విరిగిన అడవి చెట్ల పుల్లలు అతని పాదాల కింద పడి చప్పుడు చేస్తున్నాయి.

నడుస్తున్న రాజయ్య ఒక పెద్ద చెట్టు దగ్గరకు వచ్చి ఆగిపోయాడు. అక్కడ ఆ అడవిదారి రెండుగా చీలి పోయి ఉన్నది. ఒకటి దగ్గర దారి. మరొకటి చుట్టు తిరుగుడు. ఆ దారిన వెళితే చీకటి పడేవేళకు ఇంకా అడవి దాటి వెళ్ళడు. కుందేలు వేటలో పడి పొద్దు విషయమే మరచిపోయాడు రాజయ్య. తీరా చూస్తే ఏమున్నది! సూర్యుడు జారిపోతున్నాడు. అడవిలో వెలుగు తగ్గిపోతున్నది.

ఇప్పు డేమిటి చెయ్యటం?

దగ్గరి దారిన వెళ్ళవచ్చు. ఆ దారిన వెళితే సూర్యుడు కొండల్లోకి దిగిపోతున్నప్పుడే తను అడవి దాటి రోడ్డు ఎక్కగలడు.

కాని భయం. మామూలు భయం కాదు. పులి భయం.

దాదాపు పది రోజుల తర్వాత ఆ రోజునే రాజయ్య మళ్ళీ అడవిలోకి వచ్చాడు. ఈ పదిరోజులూ రాజయ్యను కొడుకు అడవిలోకి వెళ్ళనివ్వలేదు. ఆ దారిలోనే ఉన్న ఒక పెద్ద పొద దగ్గర ఒక పులి మాటు వేసి ఇద్దరు మనుషుల్ని గాయపరిచిందట. వాళ్ళిద్దరూ అడవుల్లో తిరిగే మనుషులే. తేనెపట్ల కోసం వచ్చారట. చావు తప్పి ఎట్లాగో బయట పడ్డారు. ఆ పొద దగ్గరలో పులి తిరుగుతూందన్న విషయం తెలిసిన తర్వాత రాజయ్యను కొడుకు అడవిలోకి వెళ్ళనివ్వలేదు.

పది రోజులు గడిచాయి. మళ్ళీ పులి గురించిన వార్తలు వినిపించలేదు. అది అక్కడి నుంచి ఎక్కడో లోపలకు వెళ్ళిపోయి ఉంటుందని అనుకున్నాడు రాజయ్య. సాధారణంగా పులి ఎప్పుడూ ఒకే ప్రదేశంలో ఉండదు. తిరుగుతూ ఉంటుంది అనుకున్నాడు.

పులి అక్కడి నుంచి వెళ్ళిపోయి ఉంటుందనే కొడుకు వద్దని చెబుతున్నా వినకుండా అడవిలోకి బయల్దేరాడు. అసలు విషయం ఏమిటంటే రాజయ్యకు కుందేళ్ళ మాంసం తినాలని బాగా కోరికగా ఉన్నది. అతని మనవళ్ళు కూడా కుందేలు గురించి రోజూ గొడవ చేస్తున్నారు.

అందుకే చుట్టు తిరుగుడు దారినే అడవిలోకి ప్రవేశించాడు. బాగా తిరిగాడు. కుందేలును పట్టుకున్నాడు.

కాని ఇంటి దారి పట్టేప్పుడే వచ్చింది సమస్య.

అక్కడివరకూ గంభీరంగా నడుస్తూ వచ్చిన రాజయ్య ఆ చెట్టు దగ్గరే నిలబడిపోయాడు.

ఏ దారిన నడవటం?

ఏ దారి తనని సురక్షితంగా ఇల్లు చేర్చగలదు?

ఇప్పుడు రెండో దారి చుట్టు తిరుగుడు దారి కూడా తనకు ప్రమాద కరమయినదే. చీకటి పడుతూంది. తనకు సరిగ్గా చూపు ఆనదు. ఏ అడవి పందో వెనక నుంచి మీదకు దూకిందంటే తను చెయ్యగలిగింది ఏమీ లేదు.

కాబట్టి దగ్గరి దారినే వెళ్ళాలి. ఆ దారిన వెళితే తొందరగా అడవి దాటెయ్యవచ్చు. కాని ఆ పొద దగ్గర పులి ఇంకా అక్కడే ఉన్నదో, వెళ్ళి పోయిందో? వెళ్ళిపోయి ఉంటే ఫర్వా లేదు. ఒకవేళ అక్కడే ఉంటే? తన మీదకు విరుచుకుపడితే? తను ఎదిరించగలడా? పులితో పోరాడి తన ప్రాణాన్ని కాపాడుకోగలడా?

అసాధ్యం. . . ఇప్పుడు తనలో పులితో పోరాడే శక్తి లేదు. తను ముసలివాడయ్యాడు. తను ప్రతి

ఘటించలేదు.

పొద్దు పరుగులు దీస్తూంది. వెలుగు క్షీణించి పోతున్నది. ఒకవైపు నుంచి అడవిలో అప్పుడే చీకట్లు ముసురుకుంటూ వస్తున్నాయి.

ఇంకేమీ ఆలోచించలేదు రాజయ్య.

దగ్గరి దారినే ఎన్నుకున్నాడు అతను. ముందుకు అడుగు వెయ్యబోతూ కుందేలును చూశాడు. దాని కళ్ళు భయంతో బెదురుతున్నాయి. భయంతో దాని శరీరం వణుకుతూంది. దాని భయం చూస్తే రాజయ్యకు నవ్వు వచ్చింది. ఇంటి దగ్గర మనవళ్ళకు ఆ రోజు తప్పకుండా కుందేలును తీసుకువస్తానని చెప్పాడు రాజయ్య.

మళ్ళీ అతని నడక మొదలయింది. కొంచెం దూరం బాగానే నడిచాడుగానీ ఆ పెద్ద పొద దగ్గరకు వస్తున్నకొద్దీ అతని నడకలో వేగం తగ్గిపోయింది.

ఆ పొద దగ్గరే పులి మాటు వేసి ఇద్దరిని గాయపరిచింది.

నడుస్తుంటే రాజయ్యకాళ్ళు ఎవరో పట్టి ఆపుతున్నట్టు ఆగిపోతున్నాయి పొద కనిపిస్తూంది. ఆ పొద పక్కనే పులి తనకోసం పొంచి ఉన్నట్టుగానే అనిపించింది.

రాజయ్య శరీరంలో సన్నగా వణుకు మొదలయింది.

కళ్ళలో భయం చోటు చేసుకుంటున్నది. చిన్నగా బలవంతాన అడుగులు వేస్తున్నాడు.

ఒకవేళ అక్కడే పులి ఉంటే? ఈ రోజుతో తన జీవితం సమాప్తమవుతుంది. ఇన్నేళ్ళు బతికి తను ఇప్పుడు పులి వాత పడి చనిపోతాడు. పులికి ఆహారం అవుతాడు.

క్షణ క్షణానికీ అతనిలో ప్రాణ భయం పెరిగిపోతున్నది. దాహమవుతున్నట్టుగా ఉంది. ఒళ్ళంతా చెమట పడుతూంది.

రాజయ్య అనుకున్నాడు—ఈ ప్రాణ భయం ఎంత భయంకరంగా ఉంది! అక్కడ పులి ఉన్నదో లేదో గానీ ఉన్నదనుకుంటే తన ప్రాణం భయంతో కొట్టుకుంటున్నది.

అతనికి నరకప్రాయంగా ఉన్నది.

ఆ పొద దగ్గరలో ఆగిపోయాడు. భయంగా పొదవైపు చూశాడు. అలికిడి లేదు. చేతిలో కుందేలు గింజుకుంటున్నది. దానికేసి చూశాడు. దాని కళ్ళలో భయం అలాగే స్పష్టంగా కనపడుతూంది. రాజయ్యకు దాని కళ్ళలో తన కళ్ళు కనిపించాయి. తన కళ్ళలో భయం తనకే స్పష్టంగా కనిపించింది.

తన కళ్ళలో ప్రాణ భయం ఈ కుందేలు చూస్తున్నదా?

వెలుగు బాగా తగ్గిపోయింది.

ఇక తను ఆలోచిస్తూ అక్కడే నిలుచుంటే మరింత ప్రమాదం. చీకటి ముంచుకు వస్తూంది.

ధైర్యం చేశాడు రాజయ్య.

గబగబా అడుగులు వేశాడు. గుండె వేగంగా కొట్టుకుంటున్నది.

కుందేలు గింజుకుంటున్నది. దాని చెవులు తన చేతిలో జారిపోతున్నాయి. కొన్ని క్షణాలు గడిచాయి.

రాజయ్య పొద దాటి పోయాడు. ప్రమాదాన్ని దాటిపోయాడు ఇక ఆపైన ఎటువంటి భయమూ లేదు.

అతను ఆగిపోయాడు, దూరంగా రోడ్డు కనిపిస్తున్నది.

అతనికి ఆయాసం వచ్చింది. గబగబా శ్వాస పీలుస్తున్నాడు.

పులి లేదు. ఎప్పుడో వెళ్ళిపోయి ఉంటుంది. తను అనవసరంగా భయపడ్డాడు. ఎలా భయపడినా ఎంత నరకం అనుభవించాడు కొన్ని క్షణాల్లో.

ఎన్ని క్షణాలయినా ప్రాణభయం ఎంత దారుణమైనది?

రాజయ్య ఆయాసం తగ్గింది.

అతని చేతిలో కుందేలు గింజుకుంటున్నది ఇంకా దాని మొహంలోకి చూశాడు. దాని కళ్ళలో భయం ఇంకా అలాగే కనపడుతూంది. ప్రాణ భిక్ష పెట్టమని వేడుకుంటున్నట్టున్నా దాని చూపులు.

అతనిలో ఆలోచనలు చెలరేగాయి.

ఈ చిన్న కుందేలు తన గురించి భయపడుతోంది తనకి చిక్కి. తను క్షణం క్రితం వరకు పులి గురించి భయపడ్డాడు. ప్రాణభయం అంటే ఏమిటో తనకు బాగా తెలిసింది.

ప్రాణులు ఏవైనా చిన్నవైనా పెద్దవైనా ప్రాణభయం ఒక్కటే అన్నింటికీ—

ఇలా అనుకున్న తర్వాత రాజయ్య ఇంకేమీ ఆలోచించలేదు. ఒక్కసారి కుందేలును చూసి చిరునవ్వు నవ్వి దాన్ని కిందకు దించి వదిలిపెట్టాడు.

అంతే, అది ఒక్క గెంతులో అక్కడికి దగ్గరే ఉన్న ఒక చిన్న పొదలోకి వెళ్ళి పోయింది.

రాజయ్యకు కుందేలు అలా వెళ్ళిపోవటం చూడగానే గొప్ప రిలీఫ్ కలిగినట్టు అనిపించింది.

ఏదో గొప్ప సత్యాన్ని కనుగొన్నవాడిలా—ఏదో ఘనకార్యం చేసినవాడిలా గంభీరంగా పెద్ద పెద్ద అడుగులు వేస్తూ అడవి దాటుతూ వెళ్ళిపోయాడు రాజయ్య. ★

మార్క్సిజమ్ ఎంతవరకు శాస్త్రీయమ్?
శాస్త్రీయ దృక్పథమంటే ఒకే వాదమా?
కమ్యూనిజంలో 'నిజం' నేతిబీరకాయలోని నేయితో సమానమా?
సమాధానాలకు చదవండి!
'మార్క్సుకు ౫ శతాలు' చెప్పిన శ్రీ వజ్రనఖ విశ్లేషణ
మార్క్సిజమా? మానవతా వాదమా?
(మార్క్స్ శతవర్ధంతి సందర్భంలో విడుదల)
☆
ప్రఖ్యాత సాహితీవేత్త
శ్రీ ఆర్. యస్. సుదర్శనం
ముందుమాట ఒక ప్రత్యేక ఆకర్షణ!
వెల: రు.9/-
ప్రతులకు
నవభారతి ప్రచురణలు
సాహిత్య నికేతన్.
3-4-852, బరకత్‌పురా.
హైదరాబాద్-500027.
VINAYAKA ADS


రావూస్ క్లినిక్
టి.బి.రోడ్
తెనాలి
హస్తప్రయోగం, అంగం చిన్నదగుట నరముల బలహీనత శీఘ్రస్ఖలనము, సుఖవ్యాధులకు, పిచ్చి, మతిభ్రమలకు, శాస్త్రీయచికిత్స, పోస్టుద్వారాచికిత్సకలదు. స్వయంగా పరీక్షించి సలహాలు, మందులు ఇవ్వగలము.
డా॥ పి. వి. కె. రావ్ B.A.,
సెక్స్ స్పెషలిస్టు, వైద్య విద్వాన్, వైద్యాచార్య
ఫోన్స్: 3700 అండ్ 4010
ఆయుర్వేద ఇంజెక్షన్లు విద్యుచ్ఛక్తి పరికరములతో ప్రత్యేక చికిత్సకలదు.
PUSHPA
SUVARNA